క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న ఆర్డీవో జయరాం, కమిటీ సభ్యులు

నర్సీపట్నం: డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 52 అంగన్‌వాడీ పోస్టులకు ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆర్డీవో హెచ్.వి.జయరాం, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ జి.ఉషారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, సీడీపీవో మేరీ సువార్త అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. డివిజన్‌లోని నర్సీపట్నం, రావికమతం, మాడుగుల, నక్కపల్లి, కోటవురట్ల ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో కార్యకర్తలు – 9, ఆయాలు–38, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు–5 మొత్తం 52 పోస్టులకు 201 మంది హాజరయ్యారు. త్వరలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని పీడీ తెలిపారు. ఐదు ప్రాజెక్టుల సీడీపీవోలు పాల్గొన్నారు.

8 అడుగుల కొండ చిలువ హతం



హతమైన కొండ చిలువ

రావికమతం: కొమిర గ్రామంలో ఎనిమిది అడుగుల కొండ చిలువను గ్రామ రైతులు శుక్రవారం తెల్లవారుజామున హతమార్చారు. గ్రామ సమీపంలోని కొండల్లోంచి వచ్చిన కొండ చిలువ రైతు రవికుమార్ కళ్లాలోని కోళ్ల గూడు వద్ద హల్‌చల్ చేసింది. దీంతో కోళ్లు అరవడంతో సదరు రైతు చూసి కేకలు వేయగా, సమీప రైతులు వచ్చి బెదిరించినా వెళ్లలేదు. కోళ్లను పట్టేందుకు యత్నించడంతో హతమార్చి ఖననం చేశారు.

26న పాదయాత్ర విజయవంతం చేద్దాం

మాడుగుల రూరల్: విశాఖలో ఈ నెల 26న ప్రారంభం కానున్న పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పాదయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెసు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల కొండలరావు కోరారు. శుక్రవారం మాడుగుల వేణుగోపాలస్వామి ఆలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పాదయాత్ర విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నిర్వహించి, అనంతరం మరలా విశాఖకు చేరుకుని, అక్కడ నుంచి విజయవాడ వరకు సాగుతుందన్నారు. పార్టీ ఎస్సీ సెల్ ఇన్‌చార్జి బుడబండి రాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు భీమరశెట్టి భవానీ, బ్లాక్ కాంగ్రెసు అధ్యక్షుడు పుట్టా అమరయ్యగుప్తా, ఏసురాజు పాల్గొన్నారు.

దిశ, ర్యాగింగ్ చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌ఐ అప్పలనాయుడు

చోడవరం రూరల్: ప్రమాద సమయంలో రక్షణ పొందడానికి దిశ యాప్ కవచంగా ఉపకరిస్తుందని ఎస్‌ఐ బి.అప్పలనాయుడు సూచించారు. ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు దిశ, ర్యాగింగ్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే విద్యార్థుల భవిష్యత్తు ముప్పు కలుగుతుందన్నారు. అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ మనిషి మృగంగా వ్యవహరించినప్పుడు చట్టం అవసరం ఏర్పడుతుందన్నారు. ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, పి.పిచ్చమ్మ, ఎస్.ఎం.రవూఫ్, ఉపన్యాసకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

నాతవరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు లబ్ధిదారులు వేగవంతం చేయాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. మర్రిపాలెం, నాతవరం లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించే వారికి సకాలంలో బిల్లులు చెల్లిస్తామన్నారు. గడువులోపు నిర్మాణం ప్రారంభించకపోతే ఇల్లు పట్టా రద్దుతోపాటు అర్హులకు ఇల్లు మంజూరు చేస్తామన్నారు. హౌసింగ్ జేఈ జోగారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



పెదబజార్ వీధిలో ప్రజలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

గడప గడపకు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం: అర్హతే కొలమానంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చోడవరం సచివాలయం–3 పరిధి పెదబజార్, చినబజార్ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ కారణాల వల్ల ఇన్‌కం ట్యాక్స్, అధిక కరెంటు బిల్లు వంటి సమస్యలతో కొందరికి ప్రభుత్వ పథకాలు మంజూరు కాలేదని పలువురు బాధితులు వాపోయారు. దీనిపై స్పందించిన ధర్మశ్రీ వెంటనే సచివాలయ సిబ్బందిని ఆదేశించి, సమస్యను పరిష్కరించి అర్హులందరికీ పథకాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక సమస్యలపై పెదబజార్ వ్యాపారులు విన్నవించడంతో వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నియోజకవర్గ పరిశీలకుడు కోలా గురువులు అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ బండారు సత్యనారాయణ, ఎంపీపీ గాడి కాసు, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, పంచాయతీరాజ్ డీఈఈ ప్రసాద్, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, బుద్ద గంగరాజు, ఎంపీటీసీల ఫ్లోర్ లీడర్ పల్లా రమణ, పంచాయతీ ఈవో నారాయణరావు, సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, వార్డు మెంబరు పసుమర్తి సంతోష్ పాల్గొన్నారు.

ఎడ్లపందేల జోరు.. కుర్రకారు హుషారు



ఎడ్ల పరుగు పందేలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్



మాడుగుల: ఎడ్ల పరుగు పందెంలో దౌడు తీస్తున్న గిత్తలు

జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం విజేత నరసాపురం

కె.కోటపాడు: జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందేల విజేతగా నరసాపురానికి చెందిన సంపత్ వినాయక ఎడ్లు విజేతగా నిలిచాయి. కె.కోటపాడులో మరిడిమాంబ తీర్థం పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన ఈ పోటీలను తొలుత ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. 26 ప్రాంతాల నుంచి వచ్చిన ఎడ్లబళ్లు పాల్గొన్నాయి. ఇందులో వేపాడ మండలం వావిలపాడుకు చెందిన మరిడిమాంబ ఎడ్లు ద్వితీయ, వల్లంపూడికి చెందిన సిద్ధి వినాయక ఎడ్లు తృతీయ, కలగాడకు చెందిన రాము నాయుడు ఎడ్లు చతుర్ధ స్థానాల్లో నిలిచాయి. తర్వాత వరుస స్థానాలను వల్లంపూడికి చెందిన సత్తిబాబు ఎడ్లు, శృంగవరానికి చెందిన వీర సత్యం ఎడ్లు, శృంగవరంకు చెందిన వీరాంజనేయ ఎడ్లు దక్కించుకున్నాయి. వీరికి నగదు బహుమతులు ఎంపీపీ జగన్ మోహన్, బండారు నారాయణపాత్రుడు, ఆర్బీకే చైర్మన్ దోకల అప్పలనాయుడు ప్రదానం చేశారు.

జంపెనలో..

మాడుగుల: జంపెనలో రాముల వారి తీర్థం నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గులు పోటీలు, జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందేలు ఆకట్టుకున్నాయి. తప్పెడు గుళ్లు, తోడపెద్దు ఉత్సవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మాడుగుల రూరల్: కె.జె.పురం పాలగెడ్డ వద్ద మరిడిమాంబ తీర్థం ఘనంగా నిర్వహించారు. కబడ్డీ, ముగ్గులు పోటీల్లో విజేతలకు ఆలయ కమిటీ చైర్మన్ వేగి గాంధీ బహుమతులు ప్రదానం చేశారు.

నూతన విద్యా విధానం అమలు తప్పనిసరి

- డిప్యూటీ డీఈవో ప్రేమ్ కుమార్



హెచ్‌ఎంలకు సూచనలు చేస్తున్న డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కమార్

రోలుగుంట: విద్యార్థుల నుంచి శతశాతం ఫలితాల సాధన కోసం చేపట్టిన నూతన విద్యా విధానం పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేయాలని హెచ్‌ఎంలను డిప్యూటీ డీఈవో ప్రేమకుమార్ ఆదేశించారు. జిల్లాలో విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందర్శన కోసం అన్ని పాఠశాలల్లో విద్యాపరంగా సంసిద్ధం చేసే భాగంగా శుక్రవారం ఆయన స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అనంతరం మండలంలో జెడ్పీ హైస్కూళ్ల హెచ్‌ఎంలతో సమీక్షించారు. పాఠశాలల వారీగా అమలవుతున్న విద్యా విధానం, రికార్డుల నిర్వహణ, విద్యార్థుల విద్యా సామర్థ్యం తదితర అంశాలపై చర్చించి అవసరమైన సూచనలు చేశారు. ఎంఈవో సాయిశైలజ పాల్గొన్నారు.

పంట మార్పిడితో భూమి సారవంతం



వారాడ రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు

కె.కోటపాడు: రబీలో పంట మార్పిడితో సాగు చేయడం ద్వారా భూమి సారవంతంతోపాటు అధిక దిగుబడి పొందవచ్చునని అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు చిరంజీవి, తులసీమణి తెలిపారు. వైఎస్సార్ పొలంబడిలో భాగంగా శుక్రవారం వారాడలో అపరాల పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా అపరాల సాగులో బంగారుతీగ కలుపు సమస్య ఉన్నట్లు గుర్తించారు. నివారణకు ఎకరానికి 250 ఎంఎల్‌ల సూపర్ మిశ్రమాన్ని 200 లీటరు నీటిలో వేసి పంటకు పిచికారీ చేయాలని సూచించారు. రబీలో మొక్కజొన్న వేస్తే ఎకరానికి రూ.70 వేల ఆదాయం వస్తుందన్నారు. సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, గోపి, ఏవో సోమశేఖర్, పూజిత పాల్గొన్నారు.

షిర్డీ సాయి సేవా సమాజ్ అధ్యక్షుడిగా రాంగోపాల్



అధ్యక్షుడు రాంగోపాల్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

నర్సీపట్నం: పట్టణంలో షిర్డీ సాయి సేవా సమాజ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్రి రాంగోపాల్(సినీ నిర్మాత), వైస్ ప్రెసిడెంట్‌గా పోతల సత్యనారాయణ, సెక్రటరీగా వేగేశిన రామచంద్రరాజు, జాయింట్ సెక్రటరీగా నంబూరి సత్యనారాయణ, ట్రెజరర్‌గా లంక ఈశ్వరరావు, కమిటీ సభ్యులుగా పి.వి. రమణారావు, మోటూరి లోవరాజు, త్రినాధరావు, శంకరరావు, దుర్గాప్రసాద్, మీసాల సత్యనారాయణ, వెంకటేశ్వరావు, రమణారావు, శానాపతి సత్యనారాయణ, లాలం అప్పారావు, శ్రీనివాసరావు, రామారావు, రాజేష్‌శర్మ ఎన్నికయ్యారు.

జి.నగరం ఘటనపై నిరసన దీక్ష



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేస్తున్న దళిత సంఘాల నాయకులు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం జి.నగరంలో దాడిని ఖండిస్తూ దళిత సంఘాల నాయకులు శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు చిట్ల చలపతిరావు, సరమండ వీరబాబు, ఈరెల్లి చిరంజీవి, ఎం.చంటిబాబు, సాల్మన్ రాజు, అల్లంపల్లి ఈశ్వరరావు, కొండ్రు మరిడియ్య, కె.మల్లేష్, వై.పాపారావు మాట్లాడుతూ దళిత యువకులపై దాడికి చేసిన వారిని బాధ్యులను తక్షణమే అరెస్టు చేయాలని, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిని వదిలి పెట్టి తొమ్మిది మంది దళితులపై అన్యాయంగా నమోదు చేసిన 307 సెక్షన్ ఎత్తివేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు కొండ్రు అప్పారావు, చెవ్వల నాగేశ్వరరావు, బైపా రమణ, గోవింద, బొండాడ దుర్గారావు, గుడాల పృధ్వీరాజు, గుడాల అప్పారావు, బత్తు సతీష్, గుడాల రాజుబాబు, శ్రీను పాల్గొన్నారు.

పాఠశాల ఏర్పాటు చేయాలని గిరిజనుల నిరసన

రావికమతం: అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల సరిహద్దులో ఉన్న చీమలపాడు పంచాయతీ శివారు నేరేడుబందలో 28 మంది చిన్నారులకు పాఠశాల ఏర్పాటు చేయాలని గ్రామస్తులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులకు దరఖాస్తులు చేసినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు కిల్లో సూరిబాబు, డిప్పల అప్పారావు, పొట్టి దొర వాపోయారు. అడవిలోంచి ఐదు కిలోమీటర్లు నడిచి జెడ్.జోగింపేట స్కూల్‌కు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యతోపాటు గ్రామానికి రహదారి, తాగునీరు సదుపాయం కోరుతూ 15 రోజుల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకూ పాదయాత్ర చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.

పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి

- ట్రైనీ కలెక్టర్ ధాత్రీరెడ్డి



చినమదీన గ్రామస్తులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ ధాత్రీరెడ్డి

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ కలెక్టర్ ధాత్రీరెడ్డి సూచించారు. శుక్రవారం ఆమె చినమదీనలో గ్రామస్తులతో మాట్లాడారు. నవరత్నాలతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాల కు నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. తహసీల్దారు, ఆర్ఐతోపాటు వీఆర్వో, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బి.సింగవరంలో 'గడప గడపకు'

చీడికాడ: బి.సింగవరం పంచాయతీలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. ఉదయం 7:30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



రామన్నపాలెంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ, ఎమ్మెల్యే

- అనకాపల్లి ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి తెలిపారు. మండలంలోని కొత్తపాలెం, రామన్నపాలెం పంచాయతీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌తోపాటు ఆమె రామన్నపాలెంలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. గర్భిణులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేయడంతోపాటు పథకాలపై ముద్రించిన బ్రోచర్లను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. ఎమ్మెల్యే గణేష్ స్థానికులతో మాట్లాడారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రాజారావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పార్టీ జిల్లా కార్యదర్శులు చిటికెల రమణ, గోవిందరావు, సర్పంచ్ మాకిరెడ్డి అయ్యప్ప, నాయకులు భద్రాచలం, హరిబాబు, నానాజీ, కృష్ణంరాజు, అడిగర్ల శ్రీను, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలపై అవగాహన తప్పనిసరి

- ఎంవీఐ వెంకటరావు



సిబ్బందితో కలిసి కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంవీఐ వెంకటరావు

నర్సీపట్నం: నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే ప్రాణాలు పణంగా పెట్టాల్సి వస్తుందన్న విషయాన్ని అందరూ గుర్తించాలని నర్సీపట్నం ఎంవీఐ ఆర్. వెంకటరావు పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎంవీఐ కార్యాలయంలో వాహనదారులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సిబ్బందితో కలిసి ఎంవీఐ భద్రతా వారోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నిబంధనలతోపాటు రోడ్డు పక్కన సూచిక బోర్డుల గుర్తులపై వాహనదారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెంట్, సీట్ బెల్టు ధరించాలన్నారు. అతి వేగం వద్దని, మద్యం తాగి వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. మీపై ఆధారపడి జీవించే వారిని దృష్టిలో పెట్టుకుని వాహనాలను నడపాలన్నారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనీస జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ

నాతవరం: వాహనాలు నడిపే వారితోపాటు ప్రయాణికులకు సైతం కనీసం జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చునని ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ తెలిపారు. వెలుగు ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నాతవరంలో ర్యాలీ నిర్వహించారు. మండలంలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రధాన రోడ్లపై స్పీడు బేకర్లు, వాహనాలు వేగం తగ్గించేందుకు ఐరన్ గేట్లు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి, మానవ వనరులు అభివృద్ధి అధికారి రుత్తల శ్రీను, వెలుగు సీఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



కె.కోటపాడు: మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శైలజ



నాతవరం: అవగాహన సదుస్సులో వైద్యాధికారి ప్రసన్న

నాతవరం: పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకున్నట్లయితే రక్తహీనత సమస్య ఉండదని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న తెలిపారు. శుక్రవారం నాతవరం హైస్కూల్, చమ్మచింత, మాధవనగరం గ్రామాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయలక్ష్మి ఆధ్వర్యంలో కిశోర్‌బాలికలకు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రక్తహీనత కారణంగా అనేక రోగాలు వ్యాపించే అవకాశం ఉందన్నారు. మనకు అందుబాటులో తక్కువ ధరకే లభ్యమయ్యే పోషకాలు ఉండే ఆహారం తీసుకుంటే ఎలాంటి రోగాలు దరి చేరవన్నారు. ఎం.ఎల్.హెచ్.డి టి.మౌనిక కార్యకర్త లు వరలక్ష్మి, రాజేశ్వరి, సత్యవతి, వసంత పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు ఆరోగ్య సూచనలు

కె.కోటపాడు: ఎనీమియా బారిన పడకుండా ఉండేందుకు వైద్య సిబ్బంది ఇచ్చే ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. పిండ్రంగిలో రక్తహీనత బాధితులను గుర్తించేందుకు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్తహీనత సమస్యను అధిగమించేందుకు పౌష్టికాహారంతోపాటు అవసరమైన వారికి ఐరన్ మాత్రలు, సిరప్‌లను ఇస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ జాగరపు వెంకట రామలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై అవగాహన

మాడుగుల రూరల్: మహిళల్లో రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కె.జె.పురం పీహెచ్‌సీ పీహెచ్‌ఎన్ ఇందిర తెలిపారు. స్వాభిమాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కె.జె.పురం గ్రామ సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత నివారణపై ఆమె అవగాహన కల్పించారు. సర్పంచ్ జామి రమణబాబు, ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పెంకి శివ, ఏఎన్ఎం శ్రావణి, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



పెదగొలుగొండపేటలో పైపులైను పనులు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్

నాతవరం: వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్ తెలిపారు. పెదగొలుగొండపేట, ఎం.బి.పట్నం గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. మండలంలో జల జీవన్ మిషన్ నుంచి రూ.10 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు పనులు చురుగ్గా చేస్తున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ మంజూరు చేసిన నిధులతో ఆయా పంచాయతీల్లో డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. ముందస్తుగా బోర్లు మరమ్మతులు చేస్తున్నామన్నారు. వర్కు ఇన్‌స్పెక్టరు రామకృష్ణ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిళ్లు దగ్ధం

- రూ.1.50 లక్షల ఆస్తి నష్టం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

చోడవరం రూరల్: లక్ష్మీపురంలో గురువారం అర్ధరాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో రెండు కుటుంబాలకు చెందిన పూరిళ్లు దగ్ధమయ్యాయి. ప్రమాద నష్టం రూ.1.50 లక్షలు ఉంటుందని అంచనా. అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో సంభవించిన ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన కోరుకొండ కృష్ణవేణి, కాశీ సోమరాజులకు చెందిన పూరిళ్లు కాలిపోయాయి. రూ.40 వేలతోపాటు తులం బంగారు పుస్తెల తాడు, 20 తులాల వెండి పట్టీలు, గ్యాస్ స్టౌ, ఫ్యాన్ ఇతర వంటసామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం మేరకు ఫైర్ ఆఫీసర్ పి.వి.రామస్వామి తమ సిబ్బందితో ప్రమాద స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే సర్పంచ్ సిరిసోళ్ల ఆదిగణపతినాయుడు, తదితర గ్రామస్తులు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేయడంలో నిమగ్నమయ్యారు. విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ప్రమాదం సంభవించి ఉంటుందని అనుమానిస్తున్నారు.

ఆలయ ధర్మకర్త విధులకు ఆటంకం సరికాదు

దేవరాపల్లి: వంశపారంపర్యంగా వస్తున్న ఆలయ ధర్మకర్త విధులకు స్థానిక సర్పంచ్ భర్త ఆటంకం కలిగిస్తున్నారని కలిగొట్ల పైడితల్లమ్మ ఆలయ ధర్మకర్త బొడ్డు పాలవెల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కలిగొట్లలో ఆలయ ధర్మకర్త కుటుంబ సభ్యుడు బొడ్డు జగదీశ్వరరావుతో కలిసి ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సర్పంచ్ భర్త పార్థసారథి వర్గీయులు చేస్తున్న ఆటంకాలపై పోలీసులకు పిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఇదే విషయమై కోర్టును ఆశ్రయించగా, తమకు అనుకూలంగా ఆదేశాలిచ్చిందన్నారు. ఈ విషయంలోనూ తమకు న్యాయం జరగలేదన్నారు. ఆలయంలో హుండీ కానుకల లెక్కింపును అడ్డగించడంతోపాటు తమ ఆధీనంలోని కంచు గుర్రాలను వేరే చోటకు తీసుకుపోయారని ఆరోపించారు. జి.సిమ్మినాయుడు, జి.సన్యాసినాయుడు, డి. నాయుడు బాబు, ఎం.రాజునాయుడు, జి.దేముడుబాబు పాల్గొన్నారు.

సచివాలయ కోఆర్డినేటర్లదే బాధ్యత

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



కోఆర్డినేటర్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: మున్సిపాలిటీ సచివాలయ కోఆర్డినేటర్ తమరాన శ్రీనువాసరావు, రూరల్ మండల సచివాలయ కోఆర్డినేటర్ శానాపతి వెంకట రత్నంలను నియమించినట్లు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రకటించారు. నియామక పత్రాలను వారికి అందజేసి అభినందనలు తెలిపారు. వలంటీర్లు, గృహసారధులు, సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొంప కన్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.